



# మనవారెవరూ..

- ఎస్. లోకేశ్వరి

రాఘవరావుకి ఒక్కడే కొడుకు. పేరు శ్రీపతి. ఉన్న ఇల్లు కాస్తా అమ్మి కొడుకుని ఇంజనీరు చేసాడాయన. రాఘవరావు భార్య జానకి ఆయన్ని తండ్రిని చేస్తూనే కళ్లు మూసింది. వయసు తెచ్చిన వృద్ధాప్యం కొంత, జీవితంలో రుచి చూసిన కష్టాలు కొంత తోడై రాఘవరావుని బాగా కృంగదీసాయి.

కొడుక్కి పెళ్ళి కుదిరింది. బాగా వున్న కుటుంబం. అమ్మాయి రమ అందంగా ఉంది. గర్విష్టిగా కనిపించలేదు. రాఘవరావు సంతోషించాడు. పెళ్ళి ఘనంగా జరిగింది.

హైదరాబాద్‌లో శ్రీపతికి ఉద్యోగం దొరికింది. అంతా మామగారి చలవ. శ్రీపతి మామ గారు జగన్నాథం కూడా రిటైరయ్యారు. ఆయనకి భార్యా వియోగం. ఒక కూతురూ, ఒక కొడుకూ. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసేశాడు. కొడుకు దగ్గరే ఉంటున్నాడు ఆయన.

శ్రీపతి హైదరాబాద్‌లో మంచి ఇల్లు తీసుకున్నాడు. రాఘవరావు వున్న ఊళ్లోనే ఉండిపోతానని, ట్యూషన్లు చెప్పుకు కాలక్షేపం చేస్తానని ఎంత చెప్పినా అంగీకరించలేదు. తండ్రి అంటే శ్రీపతికి అరవ ప్రాణం. ఎంత సేవ చేసినా ఆయన ఋణం తీర్చుకోలేనని భార్య దగ్గర అనేవాడు. ఆమె మౌనంగా వినేది.

రమ మామగారిని కొంతకాలం బాగానే చూసింది. అయితే ఆరోగ్యం క్షీణించి రాఘవరావు ఎప్పుడూ దగ్గుతూ వుండేవాడు. ఈ కారణం చేత కోడలు రమ ఆయనమీద విసుగు, చిరాకు చూపించటం మొదలుపెట్టింది. అయినా, రాఘవరావు పట్టించుకొనేవాడు కాదు.

రాను రాను రమ సూటిపోటి మాటలతో ఆయన మనసు గాయపర్చసాగింది. ఇంట్లో నౌకరు కంటే హీనంగా ఆయన పరిస్థితిని మార్చేసింది. రాఘవరావు కోడలు చెప్పింది చెప్పినట్లు చేయటమే తప్ప ఏరోజూ ఆమెని విమర్శించేవాడు కాదు. ఆయనది అంతర్ముఖ స్వభావం.

రమ ప్రవర్తనని చూసి, ఆమె ధోరణిని గుర్తించిన శ్రీపతి మనసు గాయపడింది. ముందు మందలించే ప్రయత్నం చేసాడు. కానీ, రమ ధోరణి మారలేదు. మామగారిని అలాగే వేధించసాగింది.

"ఆయన నాకు తండ్రి. నీకు మామగారు. మనిద్దరికీ పూజనీయుడు. నువ్విలా ఆయన్ని అవమానం చేయటం నేను చూస్తూ ఊరుకోలేను" ఒక రోజు గట్టిగా అన్నాడు శ్రీపతి.

"వరసలు సరే. ఈ పూజ్యం గీజ్యం అనే పాత చింతకాయ పదాలు ఉపయోగించకండి. నేనేం అయన్ని మోయలేని బరువులు మోయమనటం లేదు. చిన్న చిన్న పనులు చేయించటం తప్పా? ఈ వయసులో ఆయన ఎంత ఎక్కువ పని చేస్తే ఆయన ఆరోగ్యానికే అంత మంచిది" అంది రమ.

"రేపటి నుంచి నువ్వు ఆయనకి ఏ పనీ చేయమని చెప్పకూడదు" అజ్ఞాపిస్తున్న ధోరణిలో అన్నాడు శ్రీపతి.

భర్త మాటల్ని ఖాతరు చేయలేదు రమ.

"అలా అయితే ఆయనకి రేపటి నుంచి ఇంట్లో భోజనం పెట్టవలసిన అవసరం కూడా ఉండదు."

భార్య మాటలకి ఆవేశంతో తోక తొక్కిన త్రాచులా బుస కొట్టాడు శ్రీపతి. చెయ్యి చేసుకోవాలన్నంత హీన స్థితికి దిగజారినా, నిలదొక్కుకున్నాడు.

"ఇది నా ఇల్లా? నీ ఇల్లా?" సాధ్యమైనంత మృదువుగానే అడిగాడు శ్రీపతి.

"మనిద్దరిదీను. మన ఇల్లు" పెడసరి తనం వుందా గొంతులో.

"ఇక్కడ నా మాట చెల్లుతుందా? నీ మాటా?" లోతుగా ఉందా ప్రశ్న.

"మన ఇద్దరి మాటా ఒకటైతేనే చెల్లుతుంది" మొండిగా సమాధానం చెప్పింది రమ.

ఇద్దరి మనసులూ గాయపడ్డాయి. రమకి నచ్చచెప్పాలని చూశాడు శ్రీపతి. "ఆయన ఇల్లు కూడా అమ్మి నాకు చదువు చెప్పించాడు. నేను తప్ప మరెవరూ ఆయనకి లేరు. ఈ సంగతి తెలిసే మాట్లాడుతున్నావా?"

శ్రీపతిని చిరాగ్గా, అసహనంగా చూస్తూ, "మీ నాన్న ఇల్లు అమ్మి మీకోసం ఖర్చుపెట్టింది - మీ ఉద్యోగం కోసం మా నాన్న ఖర్చుపెట్టినదాంట్లో నాలుగోవంతు కూడా వుండదు. మీమీద పూర్తి అధికారం భార్యగా, మీకు ఉద్యోగం ఇప్పించిన దానిగా నూరు శాతం నాకే వుంది."

బయట వరండాలో పేపరు చదువుకుంటున్నారు రాఘవరావు. ఈ గొడవ ముదిరితే ఆయనకి తెలుస్తుందని మౌనం వహించాడు శ్రీపతి.

మనిషికి స్వార్థం సర్వసాధారణమైన విషయం. కానీ, భర్తకి జన్మనిచ్చిన తల్లి లేదా తండ్రినే బరువుగా భావించి, వాళ్ల తిండికి కూడా ధరని 'పని' రూపంలో వసూలు చేసే మనుషులు ఉంటారని ఎప్పుడూ ఊహించలేదు శ్రీపతి. ఎదురుగా తన భార్యే ఇంత భయంకర రూపం దాల్చటం చూసి అసహనంతో, బాధతో విలవిలలాడాడు శ్రీపతి.

ఇలా కొంతకాలం గడిచింది. రాఘవరావు అనారోగ్యం మరింతగా ముదిరింది.

"ఈ రోగిష్టి మనిషిని ఏ ఆశ్రమంలోనో చేర్పించక ఇలా ఇంట్లో పెట్టుకోవటం మంచిది కాదు. త్వరలో మన ఇంట్లో పసికందు తిరగబోతున్నాడు. ఈ క్షయరోగి గాలి సోకితే నా చిన్నారి భవిష్యత్తు భగ్గుమనదూ! వెంటనే ఏదో మార్గం ఆలోచించండి" అంటూ రమ ఒకనాడు నిలదీసింది భర్తని.

శ్రీపతి సమాధానం ఇవ్వలేదు. పరిష్కార మార్గం గురించి ఆలోచించసాగాడు.

* * *

మరికొన్ని రోజులు గడిచాయి. రమ డెలివరీ రోజులు దగ్గరపడ్డాయి.

"ఏమండీ! మామగారిని వెంటనే ఈ ఇంట్లోంచి పంపించే ఏర్పాటు చేయండి. మన బాబు పుట్టిన తర్వాత... అమ్మో.. ఆ విషయం ఆలోచిస్తేనే నా ఒళ్ళు గగుర్పొడుస్తున్నది" అంది రమ బ్రతిమాలుతూ.

రమతో వాదించటం మానుకున్నాడు శ్రీపతి. పైగా భార్య నిండుచూలాలు. తను ఆమె మనసుని బాధించటంగానీ, లేక ఆమెపై చేయి చేసుకోవటం లాంటి అమానుషం గానీ చేయలేడు. స్వతహాగా నెమ్మదస్తుడు శ్రీపతి.

ఇటు భార్య చెప్పినట్లు చేయలేక, అటు తండ్రికి భార్య చెప్పిందీ చెప్ప లేక, లోలోపలే కుమిలిపోసాగాడు శ్రీపతి.

రాఘవరావు అమాయకుడు కాదు. చెవుడు లేదు. అంధుడు కాదు. ఆలోచించలేని మూర్ఖుడు కానే కాదు. ఇంట్లో పరిస్థితి అర్థం చేసుకోవటానికి ఎంతో సమయం పట్టలేదు.

ఒకరోజు కొడుకూ, కోడలూ ఇంటిలో ఉండగా చూసి, రాఘవరావు తన సూట్‌కేసు తీసుకుని, "నేను మన ఊళ్ళో కొన్నాళ్లు వుండి వస్తాను. అక్కడి వాళ్లని చూడాలనిపిస్తోంది" అన్నాడు.

"నాన్నా! మీరు మీ కోడలు మాటలు విని వుంటారు. అందుకే ఇలా అంటున్నారు. ఆ మాటలు పట్టించుకోకండి" అన్నాడు శ్రీపతి తండ్రిని బ్రతిమాలుతూ.

రాఘవరావు జవాబు చెప్పే లోపలే రమ అందుకుంది -

"తండ్రిని ఇలా బరితెగించి వెంటేసుకొస్తారనుకోలేదు. మీరు చెప్పక పోయినా ఆయన గ్రహించటం ఆయన తెలివితేటల్ని ఋజువు చేస్తున్నది! ఇక నేను కలుజేసుకోక తప్పదు" అంటూ మామగారివైపు తిరిగి-

"మీరు వెళ్ళవచ్చు మామగారూ! పసిపాప పారాడబోయే ఇంట్లో మీ లాంటి రోగులు ఉండటానికి నేను ఒప్పుకోను" అంది దురుసుగా.

రాఘవరావు జవాబు చెప్పలేదు. బయటికి నడవటానికి వెనక్కి తిరిగాడు.

అదే సమయంలో చప్పుడు చేసుకుంటూ వచ్చి బయట ఒక ఆటో ఆగింది. ఆటోలోంచి రమ తండ్రి జగన్నాథం దిగాడు.

"ఏమిటి రాఘవరావు గారూ ఈ హడావుడి! ఎక్కడికి బయలుదేరారు?" అడిగాడు జగన్నాథం నవ్వుతూ వియ్యంకుణ్ణి చూసి.

ముఖం మీద నవ్వు పులుముకుని, "మా ఊరు చూసి వద్దామని బయలుదేరాను" అన్నాడు రాఘవరావు - నిజాన్ని కప్పిపుచ్చుతూ.

"మీ ఊరికా? అక్కడ ఎవరున్నారని? ఇల్లా? ఇల్లాలా? పిల్లలా? బంధు వులా? ఎవరూ లేరు కదా!" అన్నాడు జగన్నాథం.

"అయినా, స్నేహితులున్నారు. ఆత్మబంధువులకంటె హెచ్చు" అని అనకూడని మాట ఏదో అన్నట్లు కాస్త తొట్రుపడ్డాడు రాఘవరావు.

"ఆత్మబంధువుల్లాంటి వాళ్లే కాని ఆత్మబంధువులు కాదు కదా! ఆత్మబంధు వుల్ని ఇక్కడ పెట్టుకుని ఈ సమయంలో మీరు అక్కడికి వెళ్ళటం ఏమిటి? పైగా మీ కోడలు తల్లి కాబోతూ వుంది. ఈ ఇంట్లో బుజ్జి బుజ్జి అడుగులు పడబోతున్నాయి. ఇంతటి అదృష్ట ఘడియల్ని చూడకుండా ఈ సమయంలో మీరు వెళ్ళటమేమిటి! ఆగండి" అన్నాడు జగన్నాథం.

అయినా రాఘవరావు పట్టు పట్టటంతో, "పోనీ! నేను ఉండే రెండు రోజులైనా ఉండకూడదా?" అని అడిగాడు జగన్నాథం.

ఉండమన్నట్టు కళ్ళతోనే సంజ్ఞ చేసాడు శ్రీపతి.

తప్పనిసరి అన్నట్టు సూట్‌కేసు లోపల పెట్టాడు రాఘవరావు.

తండ్రికి రాచమర్యాదలు చేసింది రమ.

రెండు రోజులు గడిచాయి. ప్రయాణ సన్నాహంలో సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటూ, దగ్గుతున్నాడు రాఘవరావు.

"మీ నాన్నగారికి వైద్యం చేయించటం లేదా?" అడిగాడు జగన్నాథం అల్లుణ్ణి చూసి.

శ్రీపతి రమవైపు చూసి మౌనం వహించాడు తప్ప మామగారి ప్రశ్నకి జవాబు ఇవ్వలేదు.

"ఆయనకి క్షయరోగం. అది ఎక్కడ తగ్గుతుంది?" అంది ఈసడింపుగా రమ. జగన్నాథం చురుగ్గా కూతురు కళ్ళల్లోకి చూసాడు.

"చిన్నప్పుడు నీకూ ఆ రోగం వచ్చింది తల్లీ! మరి అది తగ్గలేదా నేను చేయించిన వైద్యంతో!" విసురుగా అన్నాడు జగన్నాథం.

"నాన్నా! ఏమిటి మీరనేది?" రమ దెబ్బతిన్నట్టు చూసింది.

"అవునమ్మా! నేనంటున్నది నిజమే! ఇప్పుడు నేను కేన్సరుతో బాధపడు తున్నాను. నా రోగం ముదిరిందని తెలిసి, నా కోడలు నేను ఇంట్లో వుండ కూడదని గొడవ చేసింది. కోడలు కాదన్నా, కన్న కూతురువి - నీవు కాదన వన్న నమ్మకంతో ఇక్కడకు వచ్చాను. వైద్యం చేయించుకోవటానికి నాదగ్గర డబ్బున్నా, నా డబ్బు నాకు 'నావాళ్ళ'ని కొనిపెట్టగలదన్న నమ్మకం లేదు." అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు జగన్నాథం.

"నాన్నా! మీకా ఈ దుస్థితి! మీరు బాధపడకండి. మీ కూతురు చచ్చి పోలేదు. మీరు ఇక్కడే ఉండవచ్చు" అని అంటూ భర్తవైపు అంగీకరించ మన్నట్లు చూసింది రమ.

"మన ఇద్దరి మాటా ఒక్కటైతేనే ఈ ఇంట్లో చెల్లుతుంది. ఈ మాట ఒక ప్పుడు నువ్వు అన్నదే. మర్చిపోలేదు కదా?" అన్నాడు శ్రీపతి.

దెబ్బతిన్న కోడెత్రాచులా చూసింది రమ.

"నేను మీ నాన్నగారు ఇక్కడ ఉండటానికి అభ్యంతరం చెప్పటం లేదు. ఎందుకంటే - మన ఇద్దరి మాటా ఈ విషయంలో ఒకటే!" అన్నాడు శ్రీపతి.

వెంటనే రమ మనసులో ఆలోచనల తుపాను చెలరేగింది. ఆమె ముఖంలో రంగులు మారాయి.

ఆ సమయంలో కూతురువైపు చూస్తూ, "నువ్వూ, అల్లుడూ, ముఖ్యంగా నీకు పుట్టబోయే బిడ్డా నాలుగు కాలాల పాటు క్షేమంగా ఉండాలి. ఈ అనారోగ్యంతో నేను ఈ ఇంట్లో ఉండకూడదు. నువ్వేమంటావో తెలుసుకుం దామనే అన్నాను తప్ప, నేను కేన్సర్ హాస్పటల్‌లో చేరాలని వచ్చాను" అన్నాడు జగన్నాథం.

"నాన్నా! నాకు తగిన శాస్తి జరిగింది. ఇంతవరకూ మూసుకుపోయిన కళ్ళు మీరు తెరిపించారు. మీరు ఇక్కడే ఉండండి. మీ వైద్యం ఏర్పాట్లు అన్నీ మీ అల్లుడుగారు చూస్తారు" అంది రమ.

ఇంతలో సూట్‌కేసుతో బయటికి వచ్చాడు రాఘవరావు.

"మామయ్యా! మీరు ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు. ఈ ఇంట్లోనే ఉండాలి. మీరు కాక పోతే ఈ ఇంటికి పెద్ద దిక్కు ఎవరు?" అంది రమ, ఆయన చేతిలోని సూట్‌కేసు అందుకుంటూ.

రాఘవరావు వెళ్ళిపోతానని ఎంత పట్టు పట్టినా రమ ఆయన మాటలు వినలేదు.

ఈ మార్పెలా వచ్చిందో అర్థం కాక ఆశ్చర్యపోయాడు రాఘవరావు.

మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత, జగన్నాథం తన సూట్‌కేసు తీసుకుని బయలుదేరటానికి సిద్ధమయ్యాడు.

"మీరెక్కడికి నాన్నా! ఇక్కడే ఉంటానన్నారుగా!" అంది ఆశ్చర్యంగా రమ.

చిన్నగా మందహాసం చేసాడు జగన్నాథం.

"ఎలా ఉండగలనమ్మా! నా కూతురు నాకు రెండు రోజులేగా పర్మిషన్ ఇచ్చింది" అన్నాడాయన.

"మీ కూతురా? నేను కాక మీకు ఇంకొక కూతురు వుందా?" మరింత ఆశ్చర్యంగా అడిగింది.

"అవునమ్మా! నా కోడలు ఇందిర - నా కూతురు అంటే నా కోడలే కదా! ఈ ఇంట్లోకి అడుగుపెట్టిన రోజునే నువ్వు రాఘవయ్యగారి కూతురువీ - కోడలివీ రెండూ అయ్యావు. అయితే నీ ధోరణి గురించి అల్లుడు ఉత్తరం రాసినప్పుడు, నిజాన్ని నీముందు ఉంచాలనే నేను ఇలా వచ్చాను. కేన్సర్ కథ అల్లి చెప్పాను. నా ఆరోగ్యం బాగానే వుంది. అంతకీ నువ్వు మారకపోతే, రాఘవయ్య గారిని నాతో తీసుకువెళ్ళాలని, మీ అన్నా - వదినా అనుమతి తీసుకునే వచ్చాను. అయితే నువ్వు నా కూతురువి అనిపించుకున్నావు. ముందు తప్పు చేసినా, వెంటనే సరిదిద్దుకున్నావు. అదే నాకు సంతోషం. నేనిక నిశ్చింతగా వెళ్తాను." అన్నాడు జగన్నాథం. ✱